శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః అయ్యా ! ఇవాళ...తిథి వార నక్షత్రాలూ, త్యాజ్యము ఏకరువు పెట్టాడు భైరవ శాస్త్రులు.

"శాస్త్రుల్లుగారికి ఉపాదానం వెయ్యండర్రా," అని కేకపెట్టాడు మాధవరావు గారు.

"అయితే చూడండి, బాబూ. తమ తండ్రిగారి తిథి ఎల్లుండే, గుర్తుంది కాదూ ?" అన్నాడు శాస్త్రులు ప్లీడరుగారితో.

"అవునండీ. మీ అబ్బాయిగారు ఊళ్ళో ఉన్నారా"

"ఎల్లుండికి ఉంటాడులెండి. వాడూ నేనూ తప్పక వస్తాం. వేరే ఎక్కడా చెప్పకండి."

సరేనన్నాడు మాధవరావుగాడు. ఆయన భార్య దోసెడు బియ్యం తెచ్చి శాస్త్రుల్లుగారి చెంబులో వేసింది.

శాస్త్రులు వెంటనే నిష్క్రమించక, "అయితే చూడండి బాబూ ? ఈ యేడు మా రెండోవాణ్ణి బళ్ళో వేద్దామనుకుంటున్నాను. నలుగురూ తలాయింత సహాయం చేస్తున్నారు. తమరు కూడా—" అని అడిగాడు.

"అట్లాగే చూద్దాంలెండి. కుర్రవాడి చదువెంత భాగ్యం ?... అవునుగాని ఆచారం తప్పిస్తున్నారేం ?" అన్నాడు మాధవరావుగారు నవ్వుతూ.

"ఇంగ్లీషు చదువు చెప్పిస్తున్నా వేమంటున్నారా? చూడండి, బాబూ, నేను వేదం చదువుకున్నాను. ఏం బావుకున్నానూ? అక్షయపాత్ర తప్పలేదు. మా పెద్దవాడికి శాస్త్రం చెప్పించాను. 'అబ్బో, తర్కవ్యాకరణాల్లో నీ కొడుకంతటివాడు లే డన్నారు. ఏం లాభించిందీ ? సంభావనలకూ, సన్మానాలకూ తెగ తిరిగి ఆరోగ్యం పాడుచేసుకున్నాడు. హైదరాబాదులో ఏమిటో కొల్లబోతున్నదని అక్కడి కెళ్ళాడు. అక్కడ ఎంత అవమానం జరగాలో అంతా జరిగింది. ఆ తురక సామ్రాజ్యంలో తద్దినం, మంత్రాలూ, సంధ్యావందనం ముక్కలు కూడా రాని తాగుబోతు వెధవలు పెద్దవాళ్ళయి కూర్చున్నారు. మనవాళ్ళే. ఇక్కణ్ణుంచి వెళ్ళినవాళ్ళే. అయితే ఏం ? యాచకో యాచకశ్శత్రుః ! మా వాడికీ వొక పోగుపడ్డ వెధవలతోపాటు సంభావన ఇప్పించారుట. జబ్బుపడి చక్కా వచ్చాడు."

"మన తెలుగువాళ్ళ జన్మే అంతలెండి. ఎంత మానవ స్వభావమైనా ఎక్కువ స్థితిలో ఉన్నవాణ్ణి చూసి ఓరవలేక పోవటంలో అర్థం ఉందిగాని, మనవాడు వెయ్యి

రూపాయలు సంపాయించుకుంటున్నా, పదిరూపాయలు తెచ్చుకునేవాణ్ణిచూసి కళ్ళల్లో నిప్పులు పోసుకుంటాడు. అలా చూస్తే తెలుగు జాతంతా అడుక్కుతినే జాతే."

"బాగా సెలవిచ్చారు!—ఇక ఈ యాయవారం చాలొచ్చింది. మా రెండో వెధవకైనా ఇంత ఇంగ్లీషు చదువు చెప్పించి గౌరవంగా బతికే సదుపాయం చేద్దామని చూస్తున్నాను."

"నన్నడిగితే మంచిపని చేస్తున్నారంటాను. మావాణ్ణి కూడా ఈ యేడే స్కూల్లో ప్రవేశపెడుతున్నాను. మా వాడికి చదువు రాదేమో ననిపిస్తుందండీ! ఆ వెధవకు గట్టిగా రెండో యెక్కంరాదు. వాడికి లెఖ్ఖలు బొత్తిగా రావు. ఇంగ్లీషు కూడా అంతంత మాత్రమే. తెలుగేదో కాస్త ఏడుస్తాడు అందుకని మా బావమరిదిని-వీడే మా రెండో బావమరిది ఇక్కడే వుండి పిల్లవాడికి కాస్త చదువు చెప్పరా అన్నాను. మా గోపాలం ఇంటరు చదివి ట్రెయినింగ్ కూడా అయినాడు. స్కూళ్ళో మాష్టరు పని దొరకుతుందేమోనని చూస్తున్నాడు. స్కూలు కమిటీ చూడబోతే నానా అయోమయంగానూ ఉంది. అక్కడ పార్టీలూ! నియోగులూ వైదీకులూనూ! కొట్టుకు చస్తున్నారు. మా వాడికి ఉద్యోగం ఇవ్వటానికి ప్రయత్నిస్తామన్న వాళ్ళంతా మైనారిటీవాళ్ళు. మెజారిటీతో ఇద్దరు ముగ్గురైనా మావాడి కోసం పాటుపడితే తప్ప ఉద్యోగం అయ్యేటట్టులేదు. ప్రస్తుతం మీ వైదీకులదే అక్కడ రాజ్యంగా ఉంది—నే నన్నానని కోపంవద్దు" అన్నారు మాధవరావుగారు.

"ఉన్నమాటకు తప్పేమిటి, బాబూ...అయితే, చూడండీ! తమ పేరేమిటన్నారూ? గోపాలంగారా! మీరు పంతులుగారి పిల్లవాడికి చదువు చెప్పేటప్పుడు కాస్త మావాణ్ణికూడా దగ్గిర ఉండనివ్వండీ? మావాడి కోసరం తమరేమీ శ్రమ పడనక్కరలేదు, చదువులో మావాడేమంత ఘరవాలేదు. అదీగాక పక్కన ఇంకో కుర్రాడుంటే పంతులుగారి పిల్లవాడి క్కూడా కొంచెం ఉత్సాహంగా ఉంటుంది. ఏమంటారు!"

"దానికేం భాగ్యంలెండి. అట్టాగే పంపించండి" అన్నాడు గోపాలం.

తనపని ఐపోగానే భైరవశాస్త్రుల్లు శెలవు పుచ్చుకుని వెళ్ళిపోయాడు.

"ఉద్దండుడల్లే వున్నాడే! చీపురుపుల్లకూడా ఊరికే దొరికితే పోనిచ్చేట్టు కనిపించదు. దరిద్రం మనుషులచేత అటువంటి పనులు చేయిస్తుందనుకుంటా" అన్నాడు గోపాలం. అతనూ దరిద్రంలో ఉన్నవాడే.

"దరిద్రం ఏమిటి నీ మొహం! ఆయనకు కనీసం పదిహేనెకరాల పొలం వుంది. ముప్ఫై ఏళ్ళనుంచీ జోలె పట్టుకుతిరుగుతున్నాడు. నే నింతప్పట్నుంచీ ఎరుగుదును. అప్పటికీ ఇప్పటికీ ఆయన అలవాట్లు మారలేదు. ఆ నీరు కావి గుడ్డే కడతాడు. ఆ అంగ వస్త్రమే పైనవేస్తాడు. ఆ పూరి గుడిసెలోనే వుంటున్నాడు. ఈ ఊళ్ళో కనీసం వంద ఇళ్ళల్లో ఆయనే తద్దినాలు పెట్టిస్తాడు. పెళ్ళిళ్ళూ వడుగులూ చేయిస్తాడు. అపరక్రియలు కూడా తనే చేయిస్తాడు. రోజుకైదారు మానికల

బియ్యం సంపాయిస్తాడు. దొడ్లో ఒక కరేపరెబ్బ దగ్గర్నుంచీ గుమ్మడికాయ వరకూ ఏది కనిపించినా దేహీ అని చెయ్యిచాస్తాడు. నెలకు రెండురోజులన్నా ఇంట్లో వంట చేయిస్తాడో లేదో. అన్ని ఇళ్ళల్లోనూ ముత్తయిదువు పెట్టుకుంటే ఆయన పెళ్ళాం వుంది. ఎవరింటోనన్నా పెళ్ళి అయితే అయిదురోజులూ వడ్డనలూ అవీ చేస్తుంది. యాభై యేళ్ళున్నయ్యా. ఇప్పటికి మనిద్దరం తినలేని తిండి తిని హరాయించు కుంటాడు. నల్లగా చావదేలి ఎట్లా ఉన్నాడో చూడు ఉక్కుముక్క!"

"ఓరీ పిడుగా!.... వీడి కొడుక్కా నేను ఊరికే పాఠాలు చెప్పేదీ? కావలిస్తే నా ఆస్తిని అయిదుసార్లు కొనేస్తాడుకదా!" అన్నాడు గోపాలం. భైరవశాస్త్రుల్లు వంటి మనుషులుంటారని అతను కల్లోకూడా ఎరగడు.

2

భైరవ శాస్త్రుల్లు కొడుకు చదువుకుగాను లోకులదగ్గిర పాతిక రూపాయలు పోగుచేశాడు. అవి సత్యనారాయణ ఏడాది చదువుకుగాను జీతానికి పుస్తకాలకు రెండు జతల బట్టలకు కూడా సరిపోతై. ఇంకా అయిదో ఆరో మిగులుతై కూడానూ.

సత్యనారాయణనూ, మాధవరావు గారబ్బాయి రంగారావునూ బళ్ళో వేసిన రెండుమూడు రోజుల్లోపల మాధవరావుగారి బావమరిది గోపాలానికి తలవని తలం పుగా ఉద్యోగం అయింది. అవుతుందని మాధవరావుగాని, గోపాలరావుగాని కల్లో కూడా అనుకోలేదు. మాధవరావు ఈ విషయం స్కూలు ప్రెసిడెంటుతోనూ సెక్ర టరీతోనూ ప్రస్తావించినప్పుడిద్దరూ కూడా అసహ్యంగా మాట్లాడారు.

ఈ రహస్యం సత్యనారాయణ ద్వారా రంగారావుకి తెలిసి, రంగారావు ద్వారా పెద్దవాళ్ళకు తెలిసింది. సత్యనారాయణ రోజూ మాధవరావుగారింటికి వచ్చి ఒక గంటసేపు రంగారావు పక్కనే కూచుని గోపాలం చెప్పే పాఠాలు వింటూండేవాడు. గోపాలానికి ఉద్యోగం ఇప్పించింది భైరవ శాస్త్రుల్లేనని సత్యనారాయణ రంగా రావుతో రహస్యంగా అన్నాడు.

మొదట మాధవరావు ఈ మాట నమ్మలేకపోయినాడు. కాని ఆలోచించిన కొద్దీ నిజమై వుండాలనిపించింది. ఏమో ఉద్దండ ముండాకొడుకు! ఆ ప్రెసిడెంటు దగ్గరికీ, సెక్రటరీ దగ్గరికీ వెళ్ళి కాస్త గట్టిగా చెప్పాడేమో!

మర్నాడు ఉపాదానానికి వచ్చినప్పుడు మాధవరావుగారు భైరవశాస్త్రుల్లుతో "విన్నారా! మా గోపాలానికి స్కూల్లో వుద్యోగం దొరికింది" అన్నాడు.

"చాలా సంతోషం! ఎందుకు దొరకదండీ? మావాడు కూడా చెప్పాడు పాఠాలెంతో విశదంగా చెబుతారుట. వారి ధర్మమా అంటూ మా వాడికింత చదు వచ్చితే!" అన్నాడు శాస్త్రుల్లు.

"శ్రీకృష్ణార్పణం"గా ఇన్ని బియ్యం చెంబులో పోయించుకొని నిండిన చెంబులో బియ్యం జోలెలోకి మార్చుకుని శాస్త్రుల్లు వెళ్ళిపోయినాడు.

"దొంగముండాకొడుకు, అంతుచిక్కలా!" అన్నాడు గోపాలం. "ఈ పుణ్యం ఈ బ్రాహ్మడు కట్టుకున్నదే. సందేహం లేదు. ఎటువంటివాళ్ళకు ఏ విధంగా రుణ పడతామో చెప్పలేం కద!"

గోపాలం కృతజ్ఞతతో కూడిన హృదయం గలవాడు. పైకి చూపడం అలవాటు లేకపోయినా అతను తన కితరులు చేసే చిన్న చిన్న ఉపకారాలు మరిచి పొయ్యేవాడుకాడు. ఇతరులకు చిన్న చిన్న వుపకారాలు చేసే అవకాశం దొరికితే పోనిచ్చేవాడుకాదు. ఇటువంటివాళ్ళు ప్రపంచాన్ని ప్రేమించటానికి ప్రయత్నించి పరాభవం పొందుతుంటారు. ప్రపంచం మంచివాళ్ళ చేతుల్లో వుంటే గోపాలం వంటి వాళ్ళు ఉపకారం తక్కువ పొందటమూ పరాభవం ఎక్కువ పొందటమూ తరుచు జరగదు. తనకు పరాభవం జాస్తిగా జరగబట్టే గోపాలం వుపకారం చేసేవాళ్ళని మరింతగా జ్ఞాపకం పెట్టుకునేవాడు.

ఉద్యోగం దొరికిందన్న మాటేగాని స్కూలులో తనను హెడ్మాస్టరూ, పెద్ద మాష్టర్లుగా వున్న ఇతర వైదీకి మాష్టర్లూ చిన్నచూపు చూస్తారనీ, తన లోపాలన్నీ చిట్టావేసి కమిటీవారి కంపజేస్తూ వుంటారనీ, తనమీద వేగు ఉంటుందని గోపాలానికి తెలుసు. బళ్ళో మాస్టర్లంతా చెడ్డవాళ్ళు కారనీ గోపాలానికి తెలుసు. అందులో మంచివాళ్ళున్నారు. కాని వాళ్ళు అరణ్య మృగాలల్లే స్వార్థం చూసుకోవటంలో మునిగి వున్నారు. తనకు పైవాళ్ళ వల్ల అన్యాయం జరుగుతుంటే, అన్యాయమని సమ్మినా, వాళ్ళు దాన్ని గురించి ఏమీ చెయ్యరు. తమ కన్యాయం జరుగుతుంటే ఇతరులు సహాయం చెయ్యకపోయినా చెయ్యలేదనుకోరు. వీళ్ళు దాస్యంలో వుండ టమేగాక దాస్యం ఆమోదించారు కూడాను. ఆ మాటకొస్తే గోపాలం కూడా దాస్యం ఆమోదించినవాడే మరి...

సత్యనారాయణ, పాపం రంగారావుతోపాటు కూర్చునేవాడేగాని గోపాలాన్ని ఒక్క ప్రశ్న అడిగేవాడు కాడు. నోరు తెరిచేవాడుకాడు. ఈ రెండు మూడు రోజుల్నించీ జరిగిన పాఠాలేమీ లేకపోయినా సత్యనారాయణతో మాట్లాడనన్నా మాట్లాడ నందుకు గోపాలానికిప్పుడు పశ్చాత్తాపం కలిగింది. ఇప్పుడు సత్యనారాయణకు రంగారావుతోపాటు సమానమైన శ్రద్ధను చూపసాగాడు. సత్యం చాలా చురుకైన కుర్రవాడనీ, ఎంతో మంచి మార్కులు తెచ్చుకోవటం కోసం భైరవశాస్త్రుల్లు తన కొడుకును పంపిస్తున్నాడనీ గోపాలానికర్థమైంది. తన చేతితో వున్నంతవరకూ సత్యాన్ని పైకి తెద్దామనీ; బాగా కనిపెట్టి వుందామనీ అనుకున్నాడు.

కాని గోపాలం ఆశయం నెరవేరే యోగ్యత లేకపోయింది. ప్రైవేటు ట్యూషన్లు చెప్పరాదనీ, డబ్బు తీసుకున్నా తీసుకోకపోయినా ప్రైవేటు ట్యూషనుకు స్కూలు నిబంధనలు ఒప్పుకోవనీ గోపాలానికి హెడ్మాస్టరుగారు తెలియజేశారు.

రంగారావుకు గోపాలం సహాయం చెయ్యకుండా అడ్డుపడటం బ్రహ్మవశం కాదు. గోపాలం వాళ్ళింటోనే వుంటున్నాడు కాని, సత్యంమటుకు తన స్వగృహంలోనే చదువుకోవలసి వచ్చింది.

3

గోపాలం ఉద్యోగం ఏప్రిల్ నెలతో అయిపోయింది. అతని ఉద్యోగం అక్కడతో అంతంచేసి రెండు నెలలజీతం - తొంభై రూపాయలు - అదా చేశారు స్కూలు కమిటీవాళ్ళు. ఆ ఉద్యోగం అయిపోయినందుకు అతనికి విచారం కలగ లేదు. స్కూలు కక్షల మూలంగా అతను చాలా అవమానాలు భరించాడు. ఎంతో ఓర్పుగలవాడైనప్పటికీ అతనికి ఎప్పుడో నౌకరీమీద విసుగెత్తింది. స్కూలు మటుకు మంచి ఉపాధ్యాయుణ్ణి కోల్పోయింది. స్కూలందు విషయమై విచారపడలేదు.

స్కూలు కమిటీవాళ్ళ నిరంకుశ ప్రవర్తన ద్వారా గోపాలం చాలా డబ్బు కోల్పోయినాడు. కనీసం పదిహేను మంది స్కూలు విద్యార్థులు అతని దగ్గిర ట్యూషను చెప్పుకోవటానికి తయారయినారు. కొత్త మేస్టరనే నెపంమీద కమిటీవార తన్ని ట్యూషనులు చెప్పుకోనివ్వలేదు.

స్కూలులో అనేకమంది ఉపాధ్యాయులు ట్యూషనులు చెప్పుకుంటున్నారు. దత్తాత్రేయులింటోనూ, రామ్మూర్తి ఇంటోనూ, శివరామయ్య ఇంటోనూ, గణపతి ఇంటోనూ, పాతికమందీ, ముప్పైమందీ విద్యార్థులు ట్యూషన్లు చెప్పుకుని అక్కడే పడుకునేవాళ్ళు. పరీక్షలు దగ్గిరకొస్తున్న కొద్దీ ఈ విద్యార్థుల సంఖ్య దాదాపు రెండింతలకు పెరిగింది. కొంతమంది క్లాసుకు క్లాసు ఇంటిదగ్గిర చేర్చుకునేవాళ్ళు.

ఈ విద్యార్థులకు క్లాసులో రానిపాఠాలు ఇంటిదగ్గిర ఎట్లా వస్తాయి? ఏ ఆశతో ఈ విద్యార్థుల తల్లిదండ్రులు నెలకు అయిదేసి రూపాయలిచ్చి ట్యూషన్లు చెప్పిస్తున్నారు ?

ట్యూషన్లు చెప్పించుకునే విద్యార్థులకు క్లాసులో ఎక్కువ మార్కులు రావటం రివాజు. క్లాసుపరీక్షల్లో వీళ్ళెప్పుడూ తప్పరు. అయితే ఆఖరు పరీక్ష మాటేమిటి? అదీ ఉపాధ్యాయుల చేతుల్లో వున్నదే. ఎల్లయ్య క్లాసు పేపరు పుల్లయ్య చేతిలో వుంటుంది. పుల్లయ్య క్లాసు పేపరు మల్లయ్య చేతిలో వుంటుంది. అంతా బీరకాయ పీచే. నీ పేపరు నాకు చూపించు. నా పేపరు నీకు చూపిస్తా! అంతా పొట్టకోసం దేవులాడుతున్న వాళ్ళే.

ఫలితమేమంటే స్కూలు ఫైనలు వరకూ దేదీప్యమానంగా వెలిగినవాడు గవర్నమెంటు పరీక్షలో గొట్టుపడ్డట్టు పడటం జరిగేది. ఇంత డబ్బూ బుగ్గిలో పోసిన పన్నీరయిందని అప్పటికి తెలిసి వచ్చేది పిల్లల తండ్రులకు! యాభై రూపాయల జీతంగల మాస్టరు, పైన నూటయాభై సంపాదించటం విడ్డూరంగా వుండేదికాదు

స్కూలు కమిటీ కట్టుదిట్టాలతో కూడుకొని వుంటే మేస్టర్లెంత తెంచుకుపడటాని కవకాశం వుండకపోను. కాని ఈ స్కూళ్ళల్లో కుళ్ళంతా కమిటీలోనే ఉంది. ఉపాధ్యాయుల పై సంపాదనలో భాగం తీసుకుని సెక్రటరీగారే చాలా వేలు సంపాదించాడని ప్రతీతి ఉండేది. నిజం కూడా కావచ్చు.

స్కూలు విద్యార్థులలో మటుకు గోపాలం చాలా గట్టి మేస్టరనే ప్రతీతి పడిపోయింది. చదువంటే ఇష్టం వున్నవాళ్ళు లేనివాళ్ళు— అందరూ ఏకగ్రీవంగా గోపాలమంటే గౌరవంగా వుండేవాళ్ళు. శలవల్లో నలుగురు విద్యార్థులు రెండోఫారం కింది తరగతులవాళ్ళు అతని దగ్గిరికి ప్రైవేటుకొచ్చి నెలకు పదీ పదహేనూ, ఇరవై కూడా ఇచ్చి శలవలాఖర్న వేరే ఊళ్ళలో పై తరగతుల్లో ప్రవేశించటానికి ఆశపడ్డారు. వీళ్ళంతా పాసవుతామనే ఆశ ఏమీ లేని బాపతు. అయినా గోపాలం ఈ ట్యూషన్లు ఒప్పుకున్నాడు. సత్యానిక్కూడా శలవుల్లో వచ్చి తన దగ్గిర చదువుకోమన్నాడు కేవలమూ ప్రైవేటు ట్యూషన్లు చెప్పి బతకవచ్చుననే ఆశ పుట్టింది గోపాలానికి.

ఈ విధంగా గోపాలం ఒక సంవత్సరం గడిపాడు. మరుసటి సంవత్సరానికి పరిస్థితులు తారుమారై స్కూలు కమిటీలో నియోగుల సంఖ్య హెచ్చి వారికి పెత్తనం లభించింది. ఒకసారిగా పదిమంది నియోగి మెంబర్లు వచ్చి స్కూలు కమిటీలో చేరారు. స్కూలు ఆర్థిక పరిస్థితులు బాగుండని కారణంచేతా, స్కూలు నిర్వహణం గురించి వూళ్ళో అలజడి జాస్తి కావడంవల్లా ఈ మార్పు తాత్కాలికంగా మంచిదే అయింది.

ఇతర విషయాలెట్లావున్నా గోపాలం తిరిగి ఉద్యోగం సంపాదించాడు. మరుసటి సంవత్సరం అది ఖాయం కూడా అయిపోయింది.

గోపాలం సత్యానికి శాశ్వతమైన మేస్టరై పోయినాడు. సత్యం ప్రతి ఏడూ దాదాపు ప్రతి సబ్జక్టులోనూ మొట్టమొదటి మార్కు తెచ్చుకుంటుంటే గోపాలానికి స్వయంగా ఎంతో గర్వంగా వుండేది. రంగారావు మొదటి సంవత్సరమే వెనకపడిపోయినాడు. అయినా సత్యాన్ని గోపాలం వదలలేదు. రోజూ సత్యం, గోపాలంగారింట్లోనే చదువుకునేవాడు. అక్కడే పడుకునేవాడు. అతని కింటో పడుకునే అలవాటు కూడా తప్పింది.

సత్యం మూడో ఫారం చేరిన సంవత్సరం గోపాలం అతన్ని తన సెక్షనులోనే వేసుకున్నాడు. ఆ సంవత్సరం సత్యం చదువులో తీసుకున్న శ్రద్ధ గోపాలం మరే విద్యార్థి చదువులోనూ ఎన్నడూ తీసుకుని ఉండలేదు.

ఆ తరవాత సత్యానికి గోపాలం మేస్టరుగా వ్యవహరించలేదు. తనతో సమానంగానే చూసుకున్నాడు. తన ఇంటోనే సత్యాన్ని చదువుకోమన్నాడు. అప్పుడప్పుడూ అతని చదువు గురించి విచారిస్తూ వచ్చాడు. కాని స్వయంగా దగ్గిర కూర్చుని నూరిపొయ్యలేదు.

సత్యం స్కూలు ఫైనలు పరీక్షకు కూర్చునేనాటికి అతని జీవితంలో గోపాలం ఒక గొప్ప స్నేహితుడుగా తయారై సిద్ధంగా ఉన్నాడు.

4

ఇంకా కొద్దిరోజులకు పరీక్షా ఫలితాలు తెలుస్తాయనగా ఒకనాడు సత్యం వచ్చి గోపాలంతో, "మేస్టారూ, మా నాన్న నా పెళ్ళి చేద్దామని చూస్తున్నాడు. మీరేం సలహా చెబుతారు?" అని అడిగాడు.

సత్యం ఆ మాట అంటూండగా గోపాలం చేతిలో ఒక ఉత్తరం ఉంది— ఒకానొక స్నేహితుడు రాసినది. ఆ క్షణంలో సత్యం వచ్చి ఈ వార్త చెప్పి సలహా అడగటం గోపాలానికి దైవికంగా కనిపించింది.

"నన్నడిగితే చేసుకోమనే అంటాను. ఇంకా ఆలస్యం చేశావంటే పిల్ల నీకన్న మరీ చిన్నదైపోతుంది. దురదృష్టవశాత్తు మన సంఘం రజస్వలానంతర వివాహాలు ఒప్పుకోదాయె... కాని ఒక్కపని చేస్తావా, సత్యం? అర్జంటుగా నేను మీ నాన్నగారితో ఒక విషయం మాటాడాలి. ఆయనకెప్పుడు వీలవుతుందో కనుక్కో. పెద్దవాడు, ఆయన నా దగ్గిరకు రానక్కర్లేదు నేనే వచ్చి మాటాడుతాను" అన్నాడు గోపాలం.

"అదేమిటండీ, మాష్టారూ? ఆయనే మీ దగ్గరికొస్తాడులెండి. ఆయనతో ముందుగా అప్పాయింటుమెంటు పెట్టాలా?" అన్నాడు సత్యం.

"అలాకాదు. సత్యం! ఈ విషయంలో న్యాయంగా నేనే ఆయన దగ్గరికి వెళ్ళాలి."

"ఫరవాలేదులెండి, నేనింటికెళ్ళి చెప్పగానే బయల్దేరి రాడూ?" అంటూ సత్యం సెలవు పుచ్చుకున్నాడు.

సత్యం చెప్పినట్టే మరో పావుగంటలో భైరవశాస్త్రిల్లు గోపాలంగారింటి దగ్గిర హాజరయినాడు.

"రండి శాస్త్రిల్లుగారూ, దయచెయ్యండి. పెద్దలు మీరే వచ్చారు" అన్నాడు గోపాలం.

"రావటం నా విధి" అన్నాడు ముసలాయన. ఆయనకిప్పుడు అరవై చేర బడుతున్నై. కొంచెం వయసు కూడా కనిపిస్తున్నది. గోపాలం ఆయన్ని బలవంతాన కుర్చీలో కూర్చోబెట్టాడు.

"మరేంలేదు, మీవాడి వివాహం గురించి అనుకుంటున్నట్టు నాకు చూచాయగా తెలిసింది, ఆ ముక్క నిజమేనా?"

"అనుకోవటం వరకూ చేతిలో పనేగనక అనుకున్న మాట నిజమే. తమకు చెప్పుదామనుకుంటున్నాను కూడానూ. నాకు తమకంటె ఆప్తులెవరున్నారూ? తమరు

మావాడి విషయంలో తీసుకుంటున్న శ్రద్ధ మరెవరు మటు కెందుకు తీసుకుంటారు గనకా? వాడి పురాకృత పుణ్యమో ఏమిటో అనుకుంటాను!"

"ఎంత మాటన్నారు? పైకొచ్చే విద్యార్థి నావాడని చెప్పుకుందామని ఏ మేస్టరుకుండదు చెప్పండీ, రేపు మీవాడు పెద్దవాడైతే నేను చెప్పుకుని గర్వపడనూ?" గోపాలం నవ్వుతూ.

"ఏ జన్మానో మావాడు పెట్టిపుట్టబట్టే తమరంతగా వాడియందు నమ్మకం పుంచటం జరిగింది... ఇంతకూ వాడి పెళ్ళి విషయం అడగటంలో తమ వుద్దేశం-"

"మరేమీలేదు మీరు పిల్లవాడికి ఏపాటి కట్నం కోరుతున్నారు, ఎటువంటి అభిప్రాయంలో వున్నారో తెలుసుకుందామనే!"

భైరవశాస్త్రిల్లు కనుబొమ్మలు ముడేసి రెండు క్షణాలపాటు నేల కేసి చూసి తలపైకెత్తి మనస్సులో వున్నమాట చెబుతున్న వాడల్లే "అయ్యా, నేను పెద్ద గొంతెమ్మ కోరిక పెట్టుకున్నాను. మనస్సులో వున్న దురాశ బయటికి చెప్పేస్తే పోతుంది. నా రెక్కలు బలహీనమైపోయినై. శరీరంలో పూర్వపు దార్ఢ్యమూ జవసత్వాలూ లేవు. పోనుపోను కుర్రవాడి చదువు నాకు భారమై పోతుందా అనే భయం పట్టుకుంది. ఇదివరకల్లా పడ్డ కష్టమేమో పడ్డానుగాని ఇకనైనా, ఈ మిగిలిన నాలుగు రోజులూ కృష్ణా రామా అంటూ ఇల్లు కదల కుండా కూచుందామనిపిస్తున్నది. పిల్లవాడి భారం పిల్లనిచ్చేవారు తీసుకుంటే— వాడెంతవరకు చదువుకుంటానంటే అంతవరకూ—పోతానంటే ఇంగ్లాండు కూడా పంపే బాధ్యత మీద వేసుకుని చదివించినట్టయితే నాకు తినేటందు కింత లేకపోలేదు. నాకూ ఇరవై ఎకరాల ఆస్తి వుంది - అంతా స్వార్జితం సుమండీ. జోలె పట్టుకు తిరిగి సంపాదించాను. గడచిన పదేళ్ళనుంచీ ఏ రోజున నేను జోలె అవతల పారే సినా నాకు హాయిగా వెళ్ళిపొయ్యేది. కాని ఈ కుర్రవాడికోసమే నేను యాచన చేశాను. నా బొందెలో ప్రాణం వుండగా నేను కూడబెట్టగలిగిన ప్రతి చిల్లిగవ్వా వాడి చదువుకింద ధారపోయటానికే సంకల్పించాను. న్యాయంగా మా పెద్దవాడికి ఆస్తి కొంత ఇవ్వాలి చూడండీ, అది కూడా పాటించకుండా పూచికపుల్లతోసహా మా రెండోవాడి చదువుకే ధారపోద్దామనుకున్నాను. ఆడపిల్లల క్కూడా ఏమీ పెట్టినవాణ్ణి కాలేదు. వాళ్ళందరికీ ఏదో విధంగా గడిచిపోతున్నది కదా, పోనీ ఈ వున్నది పెట్టి వీణ్ణి ఎంత పైకి తీసుకురావచ్చునో చూద్దామనిపించింది...."

"ఎందుకో కొంతకాలంగా నాలో స్వార్థం కలుగుతున్నది. ఆడపిల్లలకు తలా రెండెకరాలైనా ఒదిలి ఈ కట్టెను వొదిలేద్దామనిపిస్తున్నది. మా పెద్దవాడి కిందులో సహమైనా ఇద్దామా అనిపిస్తున్నది. వాడుకూడా నామాదిరిగానే ముసలితనంలోకూడా యాచన చెయ్యాలా ఏవిటిరా ఈశ్వరా-అనిపించి జాలివేస్తున్నది. కాని పిల్లవాడి చదువు ఎటూకాకుండా చెప్పించటం ఇష్టం లేదు. మొదట బియ్యేవరకూ చదివించు దామనుకున్నాను. బియ్యే పరిపాటి అయిపోయింది. బి. యల్. చదివించుదామను

కున్నాను. అదీ చవుకయిపోతున్నది. ఏ. ఐ. సి. యస్సయినా చదివిస్తేగాని, నా మొదటిగురికి తగిలేటట్టులేదు. నా దగ్గర ఈ ఆస్తి ఉంచుకుని వాడి చదువు నష్టి మధ్యలో ఆపెయ్యటం అదీ ధర్మంగా కనిపించటంలేదు. ఒకటి రెండేసి ఎకరాలు ఆడపిల్లల కిచ్చినా, పోనీ పదెకరాలు నా పెద్దవాడి కిచ్చినా, అందువల్ల అయ్యే విని యోగం కంటే అంతా ఖర్చుచేసి అయినా - చదువింత అంటుతున్నది గనక— వీడిమీదే వినియోగపరిస్తే ఉత్తమ ఫలం ఉంటుందేమోననే ఆశ పీకుతున్నది."

"పంతులుగారూ, ఈ సందిగ్ధావస్థలో నాకొక్కటే ఉభయతారకమైన ఊహ తోచింది. ఇంతకీ కలవారి పిల్లను చేసుకుని మా రెండోవాడి చదువు బాధ్యత వారికే వొదిలేసి ఈ ఉన్న తృణమూ పెద్దపిల్ల కిచ్చేసి నేను కూడా— ఇంకా ఎంతలెండి - నాలుగు ఘడియలపాటు భగవధ్యానం చేసుకుందామనే స్వార్థంలో పడ్డాను. ముసలి వాడి కెంతతృష్ణరా అనుకుంటారేమో కడుపులో వున్న ఆలోచన పైకి అనేశాను."

అయిదారు నిమిషాలపాటు ఇద్దరూ మాట్లాడలేదు. గోపాలం తన ఎదురుగా వున్న ఈ విచిత్రమైన వ్యక్తిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాడు. ఇంతకాలమూ ఈయన వొట్ఠి లోభి అని ; యాచనా ప్రవృత్తి కలవాడనీ గోపాలం విశ్వసించాడు. అటువంటివాడు "ఇప్పుడు నాలో స్వార్థం ప్రవేశిస్తున్నది" అని ఒప్పుకుంటుంటే గోపా లానికి చెప్పరాని ఆశ్చర్యం కలిగింది. ఇంతకాలమూ ఈ ముసలాడు తన చిన్న కొడుకు కోసం ఇంత పెద్ద ప్రయత్నంమీద బయలుదేరాడని వింటుంటే ఈ"ఛాండ సుడు" అగస్త్యుడంత ఎత్తయిన మనిషిగా కనిపించాడు. ఎన్నేళ్ళ శ్రమ, ఎంత దీక్ష ! ఈ చాదస్తపు శాస్త్రుర్లుగారితో పోలిస్తే పదవుల కోసమూ బిరుదుల కోసమూ దేవులాడే వాళ్ళంతా క్రిములకన్న తక్కువ ప్రమాణంలో కనిపించారు గోపాలానికి. మామూలు లెక్కన తను తెలివిగల వాళ్ళలో జతే అయినప్పటికీ దాదాపు పదేళ్ళుగా చూస్తున్న ఈ శాస్త్రుర్లుగారిని ఆయన తన మనస్సులో మాట బయటికి చెబితే తప్ప అర్థం చేసుకోలేక పోయినాడే !

"మీరు కోరినట్టుగా జరుగుతుందనుకుంటాను. మీ స్వార్థం ఏమీలేదు. మీ కోరిక చాలా సవ్యమైనది. నాకే డబ్బుంటే మీ భారం నేను వేసుకుని మీ పిల్ల వాడికి చదువు చెప్పించి నా కూతుర్నిచ్చి వివాహం చేద్దును. ధనికులంతా ఐసీయస్ పాసయిన అల్లుళ్ళను వెతికి వేలకు వేలుపోస్తారేగాని సత్యంలాంటి వాణ్ణి చూసుకొని ఐసీయస్ పాసుచేయించే కీర్తి మీదవేసుకోరు. ఇదే తల్లక్రిందులు ప్రపంచం" అన్నాడు గోపాలం.

"మీరు చెప్పదలిచిందేదో చెప్పారుకారు" అన్నాడు శాస్త్రుల్లుగారు గోపాలా నికా ప్రశ్న అర్థంకాలేదు.

"మా వాడి పెళ్ళి ప్రస్తావన ఏ ఉద్దేశంతోనో తెచ్చారు. నా సొంత గొడ వతో మిమ్మల్ని చెప్పనిచ్చానుకాను."

గోపాలానికి సంగతి జ్ఞాపకం చెయ్యగానే అకస్మాత్తుగా బిడియం పట్టుకుని మొహం జేవురించింది.

"అబ్బే, అది వేరే విషయంలెండి. అదేమీ కుదిరేదికాదు, మనకు పొసగే సంగతి కాదు" అని గోపాలం నీళ్ళు నమిలాడు.

భైరవశాస్త్రుల్లు, నవ్వి, "నా చెవినకూడా వెయ్యరాదా ?" అన్నాడు.

"నా స్నేహితుడొకడు — బొత్తిగా లేనివాడే. పాపం, అయితే బహు యోగ్యుడు—తన పిల్లకు తెలివిగల కుర్రవాడెవడన్నా దొరికితే చూడమని నాకు రాశాడు. వైదికే. పిల్ల చాలా తెలివిగలది. సంగీతం చక్కగా పాడుతుంది, ఫిడేలు వాయిస్తుంది, ఇంటిపనులన్నీ చేస్తుంది. చాలా బుద్ధిమంతురాలు. ఆశ గదా ? మంచి సంబంధం కోసం చూస్తున్నాడు. కట్నం ఇచ్చుకోలేడు. ఖర్మం !....సత్యానికి చేసు కుంటే ఇద్దరూ ముచ్చటగా ఈడు, జోడుగా వుంటారని ఆలోచన పోయిందిగాని.... మీరు పెట్టుకున్న లైనుకూ దీనికీ కలవదు. అడిగారని చెప్పానుగాని నాకే సిగ్గుగా ఉంది చెప్పటానికి. మీ మనసులో వున్న ఆలోచన సబబైనదని తెలిసి ఇక ఈ విషయం ఎట్లా ప్రస్తావించనూ ?" అన్నాడు గోపాలం.

భైరవశాస్త్రుల్లు మళ్ళా ఒక నిమిషంపాటు నేలకేసి చూసి తల పైకెత్తి, "మీరి ప్పుడే ఆ స్నేహితుడుకే మాటా రాయకండి. రేపీ పాటికి నేనే వచ్చి మాట్లాడతాను. నాకు సెలవిప్పించండి" అంటూ లేచాడు.

గోపాలం ఆ మాటమీద అట్టే ఆశ పెట్టుకోలేదు.

5

గోపాలం మళ్ళీ పొరపాటు పడ్డాడు. మర్నాడు సాయంకాలానికి భైరవ శాస్త్రుల్లు మళ్ళీ వచ్చి కూర్చుని, "అయ్యా, మీ స్నేహితుణ్ణి ఒకసారి రమ్మనండి. వీలయితే పిల్లనూ, పిల్ల జాతకాన్ని వెంటపెట్టుకు రమ్మనండి. ఆలస్యదమృతం విషం" అన్నాడు.

"మీరేమీ తొందరపడలేదుకదా ? కాస్త విచారిస్తే సత్యానికి మంచి సంబంధం దొరుకుతుందేమో ! పిల్లనిచ్చేవారు వేలకువేలు పిల్లవాడికి ధారపోయకపోయినా, అప్పు పెట్టవచ్చు. తరవాత సత్యం తీర్చుకోలేకపోతాడా ?" అన్నాడు గోపాలం.

శాస్త్రుల్లుగారు తల అడ్డంగా తిప్పాడు.

కన్నతండ్రిని నేను పస్తాయిస్తే పిల్లనిచ్చిన మామగారు డబ్బు తెచ్చి పోస్తాడా ? అంత సులభంగా డబ్బు పొయ్యగల లక్షాధికారి తన కూతుర్ని మావాడి కిస్తాడా ? గొంతెమ్మ కోరికలు ! నేను నిన్ననే మనవి చేస్తినే...ధీరుడైనవాడు తల పెట్టిన పనులు తుదముట్టించవలసిందే. మీ స్నేహితుణ్ణి పిలిపించండి. మీ ఆప్తుల కంటె మా కాప్తులు శేరు."

మరోవారం రోజులకల్లా సత్యం పెళ్ళి స్థిరపడింది. ఇంకో పదిరోజులకు పెళ్ళి జరిగిపోయింది కూడాను.

సత్యానికి ప్రెసిడెన్సీ కాలేజీలో సీటు వచ్చింది. అతను మద్రాసు బయలుదేరి వెళ్ళేటప్పుడు గోపాలం కొన్ని ముక్కలు చెప్పాడు.

"దేవుడనుకూలిస్తే నువు చాలా ముందుకొస్తావు. కాని ఒకటి జ్ఞాపకంపెట్టుకో. నువు మీ నాన్నగారికి రుణపడబోతున్నావు— ఒక విధంగా కాదు, రెండు విధాలుగా. నీమీద ఆయన పెద్ద ఆశలు పెట్టుకున్నాడు. నువు మరికొన్ని సంవత్సరాల పాటు అహోరాత్రాలు దీక్షతో పనిచేస్తే తప్ప ఆ ఆశలు ఫలించవు. ఆయన నీ కోసం నువు పుట్టినప్పటి నుంచీ దీక్షగా నీ కోసం పనిచేశాడు. ఇంకా చేస్తున్నాడు. అది మరచిపోకు. ఆయన ముసలివాడు, నవు కుర్రాడివి. అందుచేత నీ దీక్షకంటె ఆయన దీక్ష గొప్పది. నువ్వు చెయ్యవలసింది అసాధ్యమైన విషయం కాదు.— సివిల్ సర్వీసులో చేరేవాళ్ళంతా చేస్తున్న పనే కాని మీ నాన్నగారు చేసినపని అసాధ్యమైనది. అటువంటి త్యాగం ఏ తండ్రీ చెయ్యడు.

"రెండో సంగతి ఏమిటంటే, నువు రూపాయి అణా పైసలతో నీ తండ్రిగారికి రుణపడబోతున్నావు. జ్ఞాపకం పెట్టుకో. అది తీర్చవలసిన బాకే. ఆ ఋణం తప్పించుకోదలిస్తే నువు ఏ ప్లీడరు పరీక్షో చదివేసి ప్రాక్టీసు పెట్టుకోవటం, తప్ప మరో దారిలేదు. కాని ఆ పనిచేస్తే మీనాన్నగారికి ఆర్థికమైన బాధ తప్పిస్తావుగాని ఆయనపడ్డ శ్రమంతా వృథా అవుతుంది."

సత్యం ఈ విషయాలు జ్ఞాపకం పెట్టుకుని దీక్షగా చదువుతానన్నాడు.

పట్నం చదువు ప్రారంభించినాక చిన్నతనంనుంచీ పట్నంలోనే ఎందుకు చదవకపోతినా అనిపించింది సత్యానికి. ఈ కాలపు చదువుకు తగిన వాతావరణం పట్నంలో వున్నట్టుగా చిన్న బస్తీలలో వుండదు. అక్కడ ఎంతో తెలివిగల వాళ్ళనిపించుకునే సత్యం వంటి విద్యార్థుల కెక్కువ లోకజ్ఞానం వుంటుంది. తన తోటి విద్యార్థుల్లో ఎంతో సంపన్నులూ గొప్ప సంబంధాలు కలవాళ్ళూ, అనేక రకాల ఉద్యమాల్లో తిరిగేవాళ్ళూ, ప్రతిభావంతులూ వుండటం కనిపెట్టి వాళ్ళ సహవాసాలు సంపాదించసాగాడు. అతన్నికూడా వాళ్ళు తెలివిగల విద్యార్థుల్లో ఒకడికింద స్వీకరించారు.

సత్యానికి లెక్చరర్లతో కూడా కొంత చనువు దొరికింది. ఐ. సీ. యస్. మీద ఆశ పెట్టుకున్నాడని తెలిసి వాళ్ళు కూడా ప్రోత్సహించి సలహాలిచ్చారు. ఆ సలహాల నతను వేదవాక్యాలుగా పాటించాడు. కాలేజీ చదువు కాక సత్యం యూనివర్సిటీ లైబ్రరీలో అనేక గంటలు గడిపేవాడు.

అతనికి ఎంత డబ్బు కావలసినా తండ్రి పంపిస్తూ వచ్చాడు. ఆ డబ్బు తప్ప సత్యానికి ఇంటి వాతావరణంతో ఏమీ సంబంధం లేకుండా పోయింది. పట్నం వచ్చే వరకూ సత్యం తన యింటి సంస్కారపు గిరులుదాటి పోనేలేదు. కాని ఇప్పుడు

దాన్ని దాటి ఎంత పైకి వెళ్ళితే తనకంత ఉపయోగమనిపించింది. పౌరుషం, పూర్వ సంప్రదాయాలు, మంచితనమూ—ఈ విలువలేవీ తనకు పనికివచ్చేవికావు.

6

సత్యం ఆనర్సు పరీక్షల్లో ఉత్తీర్ణుడైనాడు. తరవాత కొద్దికాలానికి ఐ.సీ.యస్. ప్రవేశ పరీక్షలో నెగ్గి ఏరుకోబడ్డాడు.

భైరవశాస్త్రుల్లు ఆరోగ్యం కొంతకాలంగా బాగాలేదు. ఆయన ఎక్కడికీ కదలటంలేదు. పెద్దకొడుకు సంసారం ఖర్చు కూడా జాస్తి అయింది. ఆయన ఇద్దరు కూతుళ్ళకు పెళ్ళి చేశాడు. సామాన్య సంబంధాలు తెచ్చినా కట్నాలు పొయ్యవలసివచ్చింది. రాబడి ఖర్చుకు చాలలేదు. కాని భైరవశాస్త్రుల్లు అణాచీటీ మీద ప్రాణంపోయినా దస్కతు పెట్టలేదు. అయినకాడికి పొలం తెగనమ్మి ఖర్చు జరిపాడు.

సత్యం ఖర్చుముందీ ఖర్చులన్నీ కలిపినా ధూపానికి రాలేదు. ఈ సంగతి భైరవశాస్త్రుల్లు అనుకున్నదేగనక ఆయన ఏమీ విచారించలేదు. ఇంగ్లండు వెళ్ళిన తరవాత సత్యం ఖర్చు అంతులేకుండా పెరిగిపోయింది. "డబ్బు జాగర్తగా వాడు" అని రాద్దామని ఎన్నిసార్లో కలం చివరిదాకా వచ్చింది కాని శాస్త్రుల్లు నిగ్రహించుకున్నాడు. సత్యాన్ని ఏవిధంగానూ నిరుత్సాహపరచరాదు. వాడు తన చదువు విషయంలో శ్రద్ధవహించినన్నాళ్ళూ ఇంకేం జరిగినా ఫరవాలేదు.

ఇంగ్లండులో శిక్షణపొంది దొరవేషంతో సత్యం దిగాడు. భైరవశాస్త్రుల్లు నిట్టూర్చాడు. సత్యం స్వరూపమే కాకుండా అతని ప్రవృత్తి గూడా చాలా మారిపోయినట్టు కనిపించింది. జీవితం గురించీ, జీవిత సమస్యల్ని గురించీ ఒక నిర్లక్ష్యభావం కనిపించింది. అది నిర్భయం కాదు, నిర్లిప్తతగూడా కాదు. అనేక స్వల్ప విషయాల్లో సత్యానికెంతో లౌకిక శ్రద్ధ ఉంది. తన దుస్తులు కొంచం మడత నలిగినా రాద్ధాంతం చేస్తాడు. గడియారం ప్రకారం పనిచేస్తున్నట్టుగా తను అనుకున్న దానికి ఒక నిమిషం జాగయితే అల్లాడిపోతాడు! ఇదంతా ఒక కొత్త సంస్కారమని శాస్త్రుల్లుకు తట్టలేదు. తనకొడుకీ లక్షణాలన్నీ అలవాటు చేసుకున్నాడని నమ్మాడు. సత్యం నేర్చిన కొత్త అలవాట్లన్నీ ఇంకా ఆయనకు తెలీవు. అదంతా తెలుసుకునే అవకాశం లేక మునుపే భైరవశాస్త్రుల్లుకు పెద్ద కనువిప్పయింది. సత్యం అంత వరకు భార్యను తెచ్చుకోలేదు. ఇప్పుడాపని చెయ్యమని తండ్రి హెచ్చరిస్తే సత్యం సరిగా వినిపించుకోలేదు.

భైరవశాస్త్రుల్లుకు కొడుకు మీద అనుమానం కలిగింది. ఏమిటి వీడి ఆలోచన? చవుకబారు వెధవలు చేసినట్టుగా అక్కడ ఏ దొరసాన్నో మరిగి వచ్చాడా!

లాంఛనంగా ప్రాయశ్చిత్తం చేసుకోమంటేనే సత్యం నీళ్ళు నమిలాడు. కాని ఎవ్వరికీ తెలీకుండా ఆ తంతు చేసేశాడు భైరవశాస్త్రులు.

ఇక గర్భాదానం విషయంలో సత్యం లొంగేట్టు కనిపించలేదు. కాస్త రెట్టించి హెచ్చరించగా, "ఇంత చదువూ చదివి నా విషయాలు నేను చూసుకోనా? నా కెందు కింత చెప్పటం?" అన్నాడు.

"ఒరే, కొన్ని విషయాలెంత చదువు చదివినా తెలీవు. అవి పెద్దవాళ్ళు చెబితే తెలియవలసిందే."

సత్యం ఏదో గొణిగాడు.

త్వరలోనే అతన్ని దూరదేశం వేశారు. అతనక్కడ ఎవతెనో—నల్లదాన్నే-పెట్టుకు వుంటున్నాడని వదంతులు వినిపించినై. సత్యం మామగారు తన వియ్యంకుడితో సంప్రదించి తన కూతుర్ని వెంటబెట్టుకుని అల్లుడి దగ్గిరికి వెళ్ళాడు.

సత్యం మామగారితో ఏమీ మాట్లాడలేదు గాని భార్యతోనే మంచిగా చెప్పాడు.

"నేను బుద్దెరగనప్పుడు మా నాన్న నీకూ నాకూ పెళ్ళి చేశాడు. నాకు నీ మీద ఏమీ కోపం లేదు. కాని ఇంగ్లండులో నాకొక బంగాలీ పిల్లతో స్నేహ మయింది. ఆ పిల్ల అక్కడ చదువుతూండేది, పత్రికలకు రాస్తూండేది. ఆ అమ్మాయికి పెళ్ళి కాలేదు. నువ్వడ్డం లేకుండా వుంటే మేమిద్దరమూ పెళ్ళాడి వుండే వాళ్ళం. కాని మా కిప్పుడా అవకాశం లేదు. నాతో స్నేహంగా వుండటానికైనా ఒప్పుకుందిగాని మరొకర్ని పెళ్ళాడడాని కిష్టపడలేదు. నేను నిన్నెరక్కమునుపే ఆమె నెరుగుదును. నీకోసం ఆమెను తరిమెయ్య మన్నావా? నా వల్ల కాదు."

"నే నెక్కడికి పోతాను? నన్ను కూడా ఇక్కడే ఉండనివ్వండి" అన్నది అతని భార్య.

"ఉండు, నాకేమీ అభ్యంతరం లేదు. కాని నా మీద అధికారము వుందనుకోకు; ప్రతిదానికీ నస పెట్టకు. ఆ ప్రకారమైతే ఉండు."

సత్యం భార్య సరస్వతి ఒక నెల పాటు భర్త దగ్గిర ఉంది. సత్యం తాగుడూ, ఆ బెంగాలీ అమ్మాయి కూడా అతనితో పాటు తాగటమూ, ఇద్దరూ తనని లక్ష్య పెట్టకుండా నానా వికారచేష్టలు చెయ్యటమూ, తనున్న ఇంట్లో నౌకరుకన్న అధమంగా చూడటమూ సహించలేక తనను పంపించమని భర్తనడిగింది. అత నామెవెంట నౌకరన్నా లేకుండా పంపాడు. అయితేనేం? సెకండు క్లాసులో ఎక్కించి పంపాడు.

* * *

"శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః"

గోపాలం కుర్చీలో కూర్చుని పత్రిక చదువుతుంటూ త్రుళ్ళిపడి లేచాడు. చంకలో బొత్తె, చేతిలో తళతళా మెరిసే చెంబూ పట్టుకుని భైరవశాస్త్రులు ప్రత్యక్ష మైనాడు.

"రండి శాస్త్రుల్లుగారూ, కూచోండి" అని గోపాలం ఆయన్ను బలవంతంగా కూచోబెట్టి "ఏమిటిది ?" అని ప్రశ్నించాడు.

"అత్యాశకు పోయినందుకు శాస్తి...చూడండి, బాబూ మనిషైనవాడు విచ్చలవిడిగా తాగటమూ, ఎవత్తెనో పెట్టుకుని ఊరేగటమూ, నేర్పే చదువేం చదువూ? ఇటువంటి చదువులుకూడా ఉంటాయా ? మనుషులు దుర్బుద్ధివల్ల ఇటువంటి పన్లు చేస్తూంటారనుకునేవాణ్ణి. చదువువల్ల కూడా ఇవి అబ్బుతాయా ?" అన్నాడు భైరవ శాస్త్రుల్లు.

"దుర్బుద్ధులందరిలోనూ వుంటూంటై. అయితే ఒక్కో చదువు సంఘ భయం పోగొట్టేస్తుంది. సంఘభీతే దైవభీతి అనుకోండి. ఈ చదువు సంఘభీతి పోగొట్టటమే కాక సంఘానికి మీమీద నామీద ఉండే కట్టుబాట్లుకూడా లేని అవకాశాలు కల్పిస్తుంది. డబ్బు పుష్కలంగా ఇస్తుంది. ఇంక అడ్డేమిటి ?" అన్నాడు గోపాలం.

"ఎంత పొరపాటూ ! మీవంటి తెలిసిన వాళ్ళుండి కూడా నాతో మాట మాత్రం చెప్పకపోతిరే !"

"చెప్పుదామని నాకు నోటిదాకా వచ్చింది. కాని మీరు డబ్బు సంపాదననే ఘనంగా చూసినట్టు కనపడ్డారు. లేనిపక్షంలో మీ పెద్దవాడి విషయంలో మీరు అసంతృప్తిపడవలసిన అవసరం ఏముందీ ! అతడు ఎంత పెద్ద మనిషి ! చదివిన చదువులో ఎంతగట్టివాడు !"

"వాడే నా నిజమైన కొడుకు ఈ వెధవ నా కొడుకేకాడు. వాడి పెళ్ళానికి రెండెకరాలు రాసి ఇస్తున్నాను. నేను ముష్టెత్తుకు బతుకుతాను ఎంతకాలంలెండి. అయిపోయింది. పిల్లలు గలవాడు, నాకున్న ఆస్తంతా నా పెద్దకొడుకే తింటాడు."

"మీరెంతసేపూ డబ్బే ఆలోచిస్తున్నారు. మీ చిన్నవాడిమీది పంతంకొద్దీ... వాడు అందరి కళ్ళల్లోనూ నికృష్టుడుగా కనిపించాలని జోలె పట్టుకున్నారుగాని మీకు తిండి జరగదా ! నన్నడిగితే మీవాడిదేమీ తప్పులేదు. తప్పంతా మీదే. వాడి జన్మకి చదువు తప్ప మరొకటి లేకుండా చేశారు. వాడికి ప్రపంచం గొడవ తెలీదు. ఒక సాహిత్యంలేదు. ఒక పురాణం లేదు. ఆఖరుకు ఒక సుమతీ శతకం పద్యమైనా వాడికి రాదు. నేనెరిగిన మటుకు వాడొక నాటకంగాని సినిమాగాని చూసిన పాపాన పోలేదు. ఇది కూడును, ఇది కూడదు అనే జ్ఞానం వాడికెట్లా వస్తుందీ ?... వాడి మానాన వాణ్ని జీవించ నివ్వండి. ఇంతడబ్బు పంపిస్తూ ఉంటాడు, ఖర్చు పెట్టుకోండి" అన్నాడు గోపాలం.

"వాడి డబ్బు నా కవసరంలేదు. అది నాకు విషంతో సమానం !"

"మన ఇచ్ఛలన్నీ పిల్లలద్వారా తీర్చుకుందామని ప్రయత్నం చేస్తే ఇదే జరుగుతుంది. వాళ్ళు మనకు దక్కకుండా పోతారు....ఫర్వాలేదు, మీవాడు మీకు డబ్బు దానం చెయ్యడు—మీ బాకీ తీరుస్తాడు; మీది మీరు దక్కించుకుని అంతతో తృప్తి పడండి. మీ మనుమడికి పనికొచ్చే చదువు చదివించండి. వాడు తన పొట్ట పోసు

కుంటూ నలుగురికి ఉపయోగపడేటట్టు చదివించండి" అన్నాడు గోపాలం.

తను అన్న మాటలు భైరవ శాస్త్రుల్లుకు కష్టం కలిగించినమాట గోపాలానికి తెలుసు. ఆయనకు కోపం తెప్పించాలనే అన్నాడా మాటలు. ఎన్నడూ తన ఇంటికి ఉపాదానానికి రాని శాస్త్రుల్లు ఇవ్వాళ రావటం దేనికి? గోపాలం సాను భూతి సంపాదించటానికి తప్పితే!

ఆయనకు ఉపాదానం వెయ్యనేలేదన్న సంగతి భైరవశాస్త్రుల్లు వెళ్ళిపోయిన పావుగంటకుగాని స్ఫురించలేదు గోపాలానికి.

ముద్రణ : ఏప్రిల్ 1947, ఆంధ్రజ్యోతి.